# దారితప్పిన మనుష్యులు

జీపు చాలా నెమ్మదిగా వెడుతోంది.

ప్రత్యేకంగా రోడ్డంటూ ఏం లేదు. హెడ్‌లైట్ల వెలుగులో ఓ కాలి బాట మాత్రం దృశ్యాదృశ్యంగా కనిపిస్తోంది. దాన్ని ఆధారం చేసుకుని జీపు ముందుకి సాగిపోతోంది. కాని దారి అంతా ఎగుడు దిగుళ్ళుగా వెహికిల్సు వెళ్ళడానికి ఏమాత్రం అనుకూలంగా లేదు. ఆ ఎత్తుపల్లాల్లో నడుస్తున్న జీపు మధ్య మధ్య ఇంతెత్తున ఎగిరిపడుతోంది. జీపులో ప్రయాణిస్తున్న ముగ్గురికీ ఏదో ఓ క్షణంలో జీపు తిరగబడిపోతుందేమో అన్న అనుమానం కూడా కలుగుతోంది అప్పుడప్పుడు. అంతే గాదు. అనుకున్న చోటికి చేరుకునే సమయానికి ఒళ్ళు వెనకటి ఆకారంతో ఉండదేమో అన్న భయం కూడా వాళ్ళ మనస్సుల్లో మెదుల్తోంది. అలాని ప్రయాణం ఆపడానికెంత మాత్రం వీల్లేదు.

డ్రైవ్ చేస్తున్న మైకేల్ చూపంతా కనిపిస్తున్న కాలిబాటమీదే కేంద్రీకృతమై వుంది. ఫ్రంట్ సీట్లో అతని పక్కన కూచున్న శ్రీధర్ సిగరెట్టు ముట్టించేడు. అగ్గిపుల్ల వెలుగులో వాచీ చూసుకున్నాడు. రాత్రి పది గంటలు దాటిపోతోంది. అగ్గిపుల్ల బైటికి విసిరేసి, సిగరెట్టు పొగ గట్టిగా రెండు దమ్ములాగి గాలిలోకి వదిలేడు.

వెనకాల సీట్లో కూచుని వున్న మాధవ్ చేతుల్లో వున్న టేప్ రికార్డర్‌లోంచి ఆశా భోన్స్లే పాడిన గజల్ ఏదో వినవస్తోంది సన్నగా.

"మైకేల్! మనం వెళ్లాల్సిన మార్గం కరక్టిగా యిదేనా?" అని ప్రశ్నించేడు శ్రీధర్.

"ఆ అనుమానం దేనికొచ్చింది బ్రదర్?" అన్నాడు మైకేల్ తల తిప్పకుండానే. శ్రీధర్ సమాధానం చెప్పలేదు. చుట్టూ చూస్తున్నాడు బైటికి. అంతటా అడివే! పైగా కటిక చీకటి. ఆ చీకట్లో చెట్లన్నీ ఆ గాడాంధకారంలో తలలు విరబోసుకున్న దయ్యాల్లా నిలబడివున్నాయి. పైగా రకరకాల వింత వింత శబ్దాలు. అప్పుడప్పుడు ఏవో కంటికి కనిపించని పక్షుల రెక్కల టప టప ధ్వనులు, కూతలు. గాలిలో తేలే మిణుగురు పురుగుల క్షణకాలపు మెరుపులు. దూరంనుంచి నక్కల ఊళలు. ఇంకేవేవో జంతువుల అరుపులు. అంతా భయం భయంగా వుంది.

"అంతకంతకీ అడివి చిక్కబడిపోతోంది. కొంపదీసి మనం దారితప్పిపోయి నట్టడవిలోకి వచ్చేస్తున్నామేమో!" అన్నాడు శ్రీధర్ అనుమానంగా.

"శ్రీధర్ గాడొక పిరికి గొడ్డురా మైకేల్! ఇదే దారి. నీకెందుకు నువ్వు లాగించు!" అన్నాడు వెనకనుంచి మాధవ్

"నోర్ముయ్‌రా రాస్కెల్! మరోమాట మాట్లాడేవంటే జీపులోంచి బైటికి తోసేస్తాను. అప్పుడే రాత్రి పది దాటిపోయింది. మూడు గంటల నుంచి ప్రయాణం చేస్తున్నా ఇంకా దూరం తరగలేదు. నేను అనుమానించడంలో తప్పేముంది?" అన్నాడు శ్రీధర్ కోపంగా.

"అది సరేరా! రోడ్డు సరిలేదు. జీపు యాభైలో అరవైలో వెళ్ళడం లేదు. టైం పట్టదా! అయినా నీకెందుకివన్నీ? నువ్వు కాస్సేపు నోర్మూసుక్కూచో!" అని కసిరేడు మాధవ్.

మైకేల్ గట్టిగా నవ్వేడు.

ఉన్నట్టుండి జీపు సడెన్ బ్రేక్‌తో ఆగింది.

"ఏమైందిరా మైకేల్?" కంగారుగా ప్రశ్నించేడు శ్రీధర్. టక్కున టేప్‌రికార్డర్ కట్టేసి మాధవ్ ఫ్రంట్ వ్యూ మిర్రర్‌లోంచి బైటికి చూసేడు.

"గట్టిగా మాట్లాడకండి!" అన్నాడు మైకేల్ ఇంజన్ ఆపకుండానే.

జీపుకెదురుగా పదిహేను యిరవై అడుగుల దూరంలో దారికడ్డంగా నిలబడివున్నయ్ రెండు ఎలుగుబంట్లు.

శ్రీధర్‌కి నిలువెల్లా చెమటలు పట్టేస్తున్నాయి. మాధవ్‌కి నోట మాట రావడం లేదు.

మైకేల్‌కి ఏం చెయ్యాలో తోచడంలేదు. జీపుని టర్న్‌చేసి మరోపక్కనుంచి వాటిని దాటి వెళ్ళిపోదామంటే... పక్కన దట్టంగా చెట్లు. దారి లేదు. ఏం చెయ్యాలి? ఇదే ప్రశ్న పదే పదే మైకేల్ మెదడుని తొలిచేస్తోంది.

"మాధవ్! ఇప్పుడు ఒకటే దారి!" అన్నాడు.

"ఏవిటి?" అన్నాడు మాధవ్ ఆత్రంగా.

"ఓ పాత గుడ్డ తీసి, ఓ పెట్రోల్ టిన్ను మూతవిప్పి బాగా తడుపు. అగ్గిపుల్లతో వెలిగించి వాటివైపు విసురు! మన అదృష్టం బావుంటే అవి పారిపోవచ్చు. మంటలంటే వాటికి చచ్చేటంత భయం అని విన్నాను!" అన్నాడు మైకేల్.

మాధవ్ నిశ్శబ్దంగా చెప్పినట్లు చేసేడు. ట్రిక్ బాగానే పని చేసింది. ఎలుగుబంట్లు క్షణాల్లో పారిపోయినై. లైన్ క్లియరైపోయింది. జీపు కదిలింది. ముగ్గురూ తేలిగ్గా నిశ్వసించేరు.

"నన్నడిగితే ఈ ప్రయాణం ఒట్టి దండగంటాను! లేనిపోని ప్రమాదాల్లో చిక్కుకోవడం తప్ప మరో ప్రయోజనం కనిపించడం లేదు!" అన్నాడు మైకేల్‌మీంచి దృష్టిని మరల్చకండానే శ్రీధర్.

"షటప్ యూ ఫూల్! అసలు నిన్నామాటే అనొద్దన్నాను! రాజేష్ కనిపించేదాకా మనకి సేఫ్టీ లేదని మీ యిద్దరికీ బాగా తెలుసు! తెలిసీ ఎందుకలా మాట్లాడతారు?" అన్నాడు వెనకసీట్లోంచి మాధవ్!

మైకేల్, శ్రీధర్ మౌనంగా వుండిపోయేరు. ఇద్దరి మనస్సులూ బాగా బరువెక్కినై. గత స్మృతుల భారం అది. అంతే

క్రోవి రామమోహన శాస్త్రి

గాదు ! దాని వెనకేదో భయం. అది ప్రాణ భయమో లేక, మరే భయమో తేల్చుకోలేని అయోమయావస్థలో పడున్నారు.

మైకేల్, శ్రీధర్, మాధవ్, రాజేష్, నలుగురూ కాలేజీలో క్లాస్‌మేట్స్! ఇంటర్ నుంచీ డిగ్రీ దాకా కలిసే చదివేరు. కొన్ని కొన్ని విషయాల్లో అభిప్రాయాల్లో భేదాలున్నా స్నేహానికే అధిక ప్రాముఖ్యాన్నిచ్చి రాజీపడుతూ అనుబంధాన్ని భద్రంగా కాపాడుకుంటూ వచ్చేరు ఇన్నాళ్ళూ. పైగా నలుగురూ సాహిత్యప్రియులు. కాస్తో కూస్తో పేరు తెచ్చుకున్నారు రచయితలుగా. ఒకే ఊళ్ళో ఉద్యోగాలు చేస్తున్నారు.

ఓ ఆర్నెల్ల కిందట రాజేష్‌కి పెళ్లి సంబంధం కుదిరింది. అయితే పెళ్ళికూతురి తండ్రి కొన్ని ఆర్థిక యిబ్బందుల్లో చిక్కుకోవడంతో పెళ్ళిమాత్రం వచ్చేయేటికి వాయిదా పడింది. మిత్రులందరికీ ఆనందం కలిగించిన విషయమేమిటంటే రాజేష్ కాబోయే భార్య సావిత్రి కూడా కథలు రాస్తుందన్నదే! ఇదంతా ఒక యెత్తు. ఆమె స్వభావం ఒక యెత్తు. సావిత్రి చాలా మోడరన్ లేడీ! అందరితోనూ ఇట్టే కలిసిపోతుంది. అందుకే రాజేష్‌తోపాటు మిగతా మిత్రులకి ఆమె చాలా నచ్చింది.

ఒకే ఊరు, పైగా రచయితలు కావడం, మంచి స్నేహసంబంధాలుండటంతో దాదాపుగా ఆ అయిదుగురూ రోజూ కలుస్తూనే వుండేవారు. విసుగూ విరామం లేకుండా సాహిత్య చర్చలు చేస్తూ ఉండేవారు.

అలాంటి ఓ సందర్భంలో వారికొక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. అయిదుగురూ కలిసి ఓ గొలుసు నవల రాయాలని. కథావస్తువు కూడా, ట్రైబల్ లైఫ్ గురించి అయి వుండాలని. స్వాతంత్ర్యం వచ్చిననాటినుంచి ప్రస్తుత కాలం వరకూ ఆ ప్రజల ఆలోచనా విధానంలో, జీవన విధానంలో, ఆర్థిక, సామాజికపరమైన విషయాల్లో క్రమానుగతంగా వచ్చిన మార్పుల్ని యధాతథంగా చిత్రించాలని. ఈ ఆలోచన సావిత్రిదే! ఆ ఆలోచనకి ప్రేరణ బలివాడ కాంతారావుగారి 'వంశధార' నవల.

చాలా రోజులు చర్చించిం తరువాత మైకేల్, మాధవ్‌లు ఓ సూచన చేసేరు. కొన్నేళ్ళకిందట వాళ్లు ఇద్దరూ ఎలక్షన్ డ్యూటీ మీద అరకు వెళ్ళేదారిలో ఉన్న అనంతగిరి వెళ్ళడం జరిగింది. అనంతగిరి నుంచి సుమారు పదిమైళ్ళు జీపులో అడవిలో ప్రయాణం చేసి, అక్కణ్ణుంచి సుమారు రెండుమూడు మైళ్ళు నడిచి, ఓ కొండజాతి వాళ్ళ గ్రామంలో ఎన్నిక నిర్వహించి వచ్చేరు. ఆనాడే ఆ గ్రామంలోని ప్రజల వెనకబడినతనాన్ని చూసి చాలా ఆశ్చర్యపడ్డారు.

అదంతా వివరించి మైకేల్, మాధవ్‌లు చెప్పగానే ఆ గ్రామాన్నే బేస్‌గా చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చేరందరూ. కనీసం పదిరోజుల క్యాంపుకి కావలసిన సరంజామా అంతా సిద్ధం చేసుకుని అయిదుగురూ బైలుదేరి వచ్చేరు.

నానా తంటాలుపడి గ్రామం చేరుకున్నారు.

గూడెం పెద్దని కన్విన్స్ చెయ్యటానికి చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. మొత్తం మీద ఓ పాకలో వుండే ఏర్పాటు చేయించుకోగలిగేరు. ఒకటి రెండు రోజులు అక్కడి జనం దూర దూరంగా తప్పుకు తిరిగినా తరవాత అలవాటైపోయి కలిసిపోయేరు.

బాగా వయోవృద్ధులైన స్త్రీ పురుషుల నించి ఎన్నెన్నో వివరాలు సేకరించి రికార్డు చేసుకోగలిగేరు.

నాలుగో రోజున రాజేష్‌కి విపరీతమైన



జ్వరం వచ్చేసింది. తాము వెంట తెచ్చుకున్న మందులు పని చెయ్యలేదు. గ్రామంలోని నేటివ్ వైద్యుడేవేవో పసర్లూ గట్రా వాడేడు. కషాయాలేవో యిచ్చేడు. కాని అవేవీ పని చెయ్యలేదు. చివరికి మైకేల్ మిగతా వాళ్లని ఒప్పించి, రాజేష్‌ని జీపులో అనంతగిరి తీసుకువెళ్లి ప్రైమరీ హెల్త్ సెంటర్లో జాయిన్ చేసేడు. అదృష్టవశాత్తూ డాక్టర్ ఊళ్లోనే వున్నాడు. వెంటనే ఎటెండై పరీక్ష చేసి, ప్రమాదం లేదనీ, రెండు మూడు రోజులు ట్రీట్‌మెంట్, తగిన రెస్టిస్తే చాలని చెప్పాడు.

ఆ రోజంతా రాజేష్‌తో గడిపి, మర్నాడు రాజేష్, అతనికి ట్రీట్‌మెంటిస్తున్న డాక్టరూ ఇచ్చిన ధైర్యంతో మళ్లీ ట్రైబల్ గూడేనికి బైలుదేరేడు.

మైకేల్ అక్కడికి చేరేసరికి పరిస్థితి చాలా దారుణంగా తయారైంది.

సావిత్రి అంతర్ధానమైందని శ్రీధర్, మాధవ్‌ల నోటి వెంట విని నిర్ఘాంతపోయేడు మైకేల్.

"ఏవిట్రా మీరనేది? గూడెం జనం యింతమంది వుండగా, మీరిద్దరూ ఆమెకి తోడుండగా సావిత్రి మాయమైపోవడం ఏమిటి? ఇప్పుడామె కనిపించకపోతే రాజేష్ ఏమైపోతాడు?" అన్నాడు కంగారుగా.

"అదేరా మాకూ అర్థం కావడంలేదు. అందరం ఏకమై, ఈ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ గాలించేస్తున్నాం. ఎక్కడా ఆమె జాడ లేదు యిప్పటి దాకా!" అన్నాడు మాధవ్.

"అసలెప్పుడు తెలుసుకున్నార్రా, ఆమె కనిపించలేదని?" అడిగేడు మైకేల్, చాలా ఆదుర్దాగా.

## దారితప్పిన మనుషులు

"నిన్నా, రాజేష్‌ని జీపు దగ్గరికి చేర్చి, మీ జీపు కదలగానే వెనక్కి తిరిగేం. మేం గూడెం చేరుకునేసరికి ఆమె పాకలో లేదు. చుట్టుప్రక్కల స్త్రీలు చెప్పేరు. అలా తిరిగి వస్తానని కొండ దిగువకు వెళ్లిందని, రెండు గంటలు దాటినా ఆమె రాకపోయేసరికి నేనూ, మాధవ్ ఆమెని వెతుక్కుంటూ బైలుదేరేం! కాని ప్రయోజనం లేకపోయింది. నిన్నటి నుంచీ ప్రయత్నించినా ఆమె కనిపించలేదురా!" అన్నాడు శ్రీధర్ బాధగా.

మైకేల్‌తో మళ్లీ అన్వేషణ రెండ్రోజుల పాటు సాగింది. కాని ఫలితం లేకపోయింది. సావిత్రి కనిపించకపోవడం ఒక సమస్య! దానికి తోడు రాజేష్ ఆరోగ్యం మరో సమస్య!

మిత్రులు ముగ్గురూ అనంతగిరి తిరిగి వెళ్లారు.

ఆశ్చర్యం ! ప్రైమరీ హెల్త్ సెంటర్లో రాజేష్ లేడు. గతం రోజు సాయంకాలం 'సావిత్రి' గారనే యువతి వచ్చిందనీ, ఆరోగ్యం కుదుటబడ్డ రాజేష్ ఆమెతో కలిసి వాళ్లుంటున్న గూడెంకే బైలుదేరేరని ఇన్‌ఫర్మేషన్ యిచ్చేరు హాస్పిటల్ స్టాఫ్!

రాత్రే బయలుదేరిన ఆ ఇద్దరూ తాము అక్కణ్ణుంచి బయలుదేరే వరకూ చేరకపోవడం ఏమిటి? అసలు సావిత్రి అకస్మాత్తుగా ఎవరికీ చెప్పకుండా గూడెం నుంచి అనంతగిరి ఎలా వచ్చింది? ఎందుకొచ్చింది? మైకేల్ మనస్సులో సమాధానం లేని ప్రశ్నలు. ఇలా ఆలోచిస్తున్న మైకేల్‌లో అన్నింటికన్న పెద్ద సందేహం ఒకటి రేగింది.




సావిత్రి గూడెంలోంచి బైలుదేరింది నాల్గురోజుల క్రితం. అనంతగిరి చేరడానికి గత రాత్రి వరకూ ఎందుకు పట్టింది? సుమారుగా మూడు రోజులు ప్రయాణం చేసిందా?

"మాధవ్! నాకు చాలా అయోమయంగా వుందిరా! సావిత్రి కనిపించకపోవడం, మాయమైన మూడురోజుల కిక్కడికి చేరడం, ఇక్కడ నుంచీ రాజేష్‌ని తీసుకుని బయల్దేరడం, ఈ రోజు మధ్యాహ్నం దాకా అక్కడికి రాకపోవడం, ఏమిటిదంతా? నమ్మశక్యం గాని మిష్టరీలా ఉంది!" అన్నాడు మైకేల్.

శ్రీధర్, మాధవ్ గతుక్కుమన్నారు.

"ఏం చేద్దాంరా యిప్పుడు?" అడిగేడు శ్రీధర్ గాబరాగా. మైకేల్, శ్రీధర్ మొహంలోకి చూస్తూ ఉండిపోయేడు కొన్ని క్షణాలు. మాధవ్ వణుకుతున్న చేతుల్తో సిగరెట్టు వెలిగించుకున్నాడు.

"దారిలో వెతుకుతూ గూడెం వెళ్లడం తప్ప మరో మార్గాంతరం లేదురా!" అన్నాడు

"అప్పుడే ఏడు గంటలు కావస్తోంది. ఈ చీకట్లో ఎలా వెతుకుతాం?" అన్నాడు శ్రీధర్.

"తప్పదు! వాళ్లిద్దర్నీ వెంట తీసుకుని గాని ఇక్కణ్ణుంచి తిరుగుప్రయాణం సాగించేది లేదు!" అన్నాడు మైకేల్ దృఢంగా.

మాధవ్, శ్రీధర్ తలవూపేరు.

జీపులో టాంక్ నిండా పెట్రోల్ నింపేరు టిన్నుల్లోంచి. వెంటనే అడవి దారి పట్టింది జీపు. మూడు గంటలు పైగా ప్రయాణం చేసినా గమ్యం రావడంలేదు. దారి తప్పినట్లు అనుమానంగా వుంది. ఎలుగుబంట్ల బారినుండి బైటపడి ప్రయాణం సాగిస్తున్నారు ముందుకి.....!

డ్రైవ్ చేస్తున్న మైకేల్ మనసులో గతమంతా ఒక్కసారిగా కదలాడింది. జరిగిన సంఘటనల్లో మిస్సింగ్ లింక్స్ చాలా ఉన్నాయి - అని అతనికి అనిపిస్తోంది. కాని అవేవిటో అతని ఊహకి అందటం లేదు.

మాధవ్ మాటలు విన్న తరవాత మైకేల్ మనసులో మళ్లా ఓ సందేహం! రాజేష్ కనిపించేదాకా సేఫ్టీ లేదన్నాడు! కాని సావిత్రిని గురించి మాట్లాడ్డేం?

"మాధవ్! సావిత్రి కనిపించకపోయినా సేఫ్టీ లేదుగా! ఆ మాటెత్తవేం?" అడిగేడు మైకేల్.

"అదేం ప్రశ్నరా? రాజేష్ సావిత్రితో కలిసే బైల్దేరేడు. వాడు కనిపిస్తే సావిత్రి కనిపించినట్లే! ఓ పేరు చెప్పి, మరో పేరు చెప్పకపోతే....పొరపాటని సరిపెట్టుకోక....ఆ పోలీసు ప్రశ్నలేవిటి? అవన్నీ వదిలేసి మనం నిజంగానే దారి తప్పాం! దాని సంగతాలో

చించు." అన్నాడు శ్రీధర్ విసుక్కుంటూ.

అప్పటికి మాధవ్ కూడా గ్రహించేడు దారి తప్పినట్లు.

"నిజమేరా! దారి తప్పిన మాట ఖాయం! ఇప్పుడెలా?" అన్నాడు మాధవ్. అతని గొంతులో వణుకు.

మైకేల్ జీపు ఆపేడు. హెడ్ లైట్స్ ఆన్ చేసే వుంచేడు. ఆ వెలుగులో ముందుకు చూస్తున్నాడు.

అంతలో దూరం నుంచీ పడుతూ లేస్తూ వస్తున్న ఓ ఆకారం వాళ్ల దృష్టిలో పడింది. ఫోకస్ ఆ ఆకారం మీద స్పష్టంగా పడేసరికి ముగ్గురూ ఒకేసారి "రాజేష్!" అన్నారు.

కొద్దిసేపు ముగ్గురూ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు జీపువైపొస్తున్న రాజేష్‌ని.

"హల్లో ఫ్రెండ్స్! దేవుళ్లల్లే కనిపించేర్రా! నిన్న రాత్రి నుంచి పిచ్చెక్కినట్లు అడివంతా తిరిగేస్తున్నాంరా సావిత్రీ, నేనూ ! గూడెం దారి దొరకలేదు. ఆ కనిపించే గుట్టమీంచి, లైట్ల వెలుగు చూసి పరిగెత్తుకొస్తున్నాను." అన్నాడు రాజేష్ బాగా ఆయాసపడిపోతూ.

"సావిత్రి క్షేమంగా వుందా?" అడిగేడు మైకేల్.

శ్రీధర్, మాధవ్ రాజేష్‌వైపు గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయేరు.

"క్షేమంగా వుంది! కాని ఆమె మనస్సే బాగాలేదురా! గూడెం పరిసరాలు చూడ్డానికి బైలుదేరే వరకే ఆమెకి గుర్తుంది. ఆ తరవాతేం జరిగిందో తను నాకోసం అనంతగిరి ఎలా వచ్చిందో, ఎందుకొచ్చిందో చెప్పలేకపోతోంది! బిహేవియర్స్ అన్నీ బావున్నాయి. మీ ముగ్గురూ ఏమయ్యారని అడుగుతోంది. నాకు సుస్తీ చేసి అనంతగిరి పి.హెచ్.సి.లో వున్నట్లు గుర్తుండటం ఆశ్చర్యమే! ఆమెకేమైందో అర్థంగావడం లేదు. బెంగపడిపోతున్నాను. అసలీ అడివిలోంచి మీరు కనిపించకపోతే బైటపడే అవకాశం కూడా కలగకపోను!" అన్నాడు రాజేష్, పెద్ద భారం దిగిపోయినట్లు ఫీలవుతూ.

"ఇంతకీ సావిత్రి ఎక్కడుందిప్పుడు?" అడిగేడు మాధవ్.

"ఇక్కడికి సుమారు అరమైలు దూరం దక్షిణంగా వెడితే ఓ చిన్న కొండ వుంది. దానిమీద నాలుగైదు గుడిసెలున్నాయి. అందులో ఉండేవాళ్లు ఖాళీచేసి పోయినట్లున్నారు. ఖాళీగా వున్నాయి. కాస్త బాగా వున్నదాంట్లో వున్నాం. మూడు, నాలుగు రోజులదాకా సరిపడే బియ్యం, వగైరాలు పప్పులు ఉప్పులు వగైరాలు కనిపించేయి. రాత్రినుంచి అక్కడే ఉడకేసుకు తింటున్నాం. పదండి వెడదాం!" అంటూ రాజేష్ జీపులో కూర్చున్నాడు.

జీపు రాళ్లదారి మీద ఓ పావుగంట నడిచి కొండ దిగువకి చేరుకుంది. జీపు దిగి కొండమీదికి చూసేరు నలుగురూ.

గుడ్డి వెన్నెల్లో పైన నాలుగైదు గుడిసెలు కనిపిస్తున్నాయి సిల్హౌటీల్లా.

"ఆ గుడిసెల్లో కుడినుంచీ రెండోదేరా. ప్రస్తుతం మా ప్రేమనగర్!" అని గట్టిగా, చిత్రంగా నవ్వేడు రాజేష్.

ఎలా నవ్వగలుగుతున్నాడో మిగతా ముగ్గురికీ అర్థం గాలేదు.

"నవ్వకురా బాబూ! భయమేస్తోంది." అన్నాడు శ్రీధర్. రాజేష్ అతని భుజం మీద గట్టిగా చరిచేడు.

"జీవితంలో ఒక్కొక్కప్పుడు ఇంతకన్న భయంకరమైన సంఘటన లెదురైతే ఏమయిపోతావురా శ్రీధర్?" అన్నాడు.






"వద్దులేరా తండ్రీ! మాకీ ప్రస్తుత అనుభవాలు చాలు!" అన్నాడు మైకేల్. నడక మొదలెట్టేరు కొండపైకి. పెద్ద ఎత్తైనది కాక పోవడంతో అయిదు నిమిషాల్లో గుడిసె దగ్గరికి చేరుకున్నారు.

రాజేష్ సన్నని గొంతుతో, "సావిత్రీ!" అని పిల్చేడు.

తడికె తలుపు తెరుచుకుంది.

"లోపలికి రండి!" అని పలికింది సావిత్రి గొంతు.

ముందు రాజేష్, ఆ వెనుక మిగిలిన ముగ్గురూ లోపలికి నడిచేరు.

"కూర్చోండ్రా ఫ్రెండ్స్! అంటూ రాజేష్ ఓ తాటాకుల చాప పరిచేడు. తనో పక్క గోనె పట్టామీద కూర్చుంటూ."

ముగ్గురూ కూర్చుని సావిత్రివైపు పరిశీలనగా చూసేరు. తెల్లని ఉల్లిపొరలాంటి చీర, జాకెట్టు ధరించింది. తల విరబోసుకుని వుంది. అలసటగాని, అనారోగ్యం గానీ, అక్కడ కలిగే అసౌకర్యాలు గానీ ఆమె ముఖంలో ఎక్కడా లేవు. ఆమె పెదవుల మీద జగన్మోహనమైన చిరునవ్వు మెరిసిపోతోంది.

"నిన్నిలా చూస్తాం అనుకోలేదు సావిత్రీ! ఏ పులివాత పడిపోయావో అని బెంగపడిపోయేం." అన్నాడు మైకేల్.

"మనుషుల కన్న మించిన పులులెక్కడివి మైకేల్? నన్ను పులులేం చేస్తాయి? పూర్ క్రీచర్స్! వంట పూర్తయింది! ఎప్పుడు తిన్నారో ఏమిటో! వడ్డించేస్తాను! బైట గోలెంలో నీళ్ళున్నాయి. కాళ్లూ, చేతులూ కడుక్కు రండి!" అన్నది సావిత్రి గల-గల నవ్వుతూ.

"ఆరోజు నువ్వెలా మాయమయ్యావు సావిత్రీ?" అని వణుకుతున్న గొంతుతో అడిగేడు మాధవ్.

"కొండ సగం దిగేవరకూ గుర్తుంది! ఆ తరవాత ఏం జరిగిందో గుర్తు లేదు!" అన్నది సావిత్రి, ఎటో చూస్తూ.

"అవన్నీ తరవాత చర్చించుకోవచ్చు! ముందు కాళ్లు కడుక్కు రండ్రా!" అన్నాడు రాజేష్.

ముందు మైకేల్ వెళ్లి కాళ్లు కడుక్కొచ్చేసేడు. వెనకే వెళ్లిన శ్రీధర్, మాధవ్‌లు, గోలెం దగ్గరికి వెళ్లి మట్టి ముంతలతో నీళ్లు తీస్తూనే పెద్దగా కేక పెట్టేరు.

మైకేల్, రాజేష్ కంగారుగా పరిగెత్తేరు.

"ఏమైందిరా?" అనడిగేడు మైకేల్.

"మైకేల్! ఇవి నీళ్లు కావురా! రక్తం! మాంసం! వెగటు వాసన కొడుతూ ఎంత చిక్కగా వున్నయ్యో!" అన్నాడు మాధవ్ వణికిపోతూ.

మైకేల్ చూసి, "రాస్కెల్స్! మీకు మతి చలిస్తోంది. ఏవేవో వూహించుకుని పిచ్చి వెధవల్లా మాట్లాడుతున్నారు. ఈ లోకంలోకి రండి!" అనరిచేడు గట్టిగా.

ఇంతలో సావిత్రి కాగడాతో వచ్చింది. ఆ వెలుగులో మళ్లీ గోలెంలోకి చూసి, "అవును! నీళ్లే! ఇంత భ్రమ పడిపోయామేమిట్రా!" అంటూ గబ-గబ కాళ్లూ చేతులూ కడుక్కుని లోపలికొచ్చేరంతా!

అయిదు నిముషాల్లో అడ్డాకుల్లో వడ్డన పూర్తి చేసింది సావిత్రి.

"మీరొస్తారని నాకు ముందే తెలుసు!" అన్నది.

"ఎలా తెలుసు?" ఆశ్చర్యపోతూ అడిగేడు శ్రీధర్.

"సిక్స్త్ సెన్స్ చెప్పింది!" అని నవ్వింది సావిత్రి.

ఏ జంతువు మాంసం వండిందో తెలీదుగాని అమోఘంగా వుందని సావిత్రి వంటని

## దారితప్పిన మనుషులు

మచ్చుకున్నాడు మాధవ్.

"నరమాంసం!" అంది సావిత్రి.

శిలా ప్రతిమల్లా అయిపోయేరు మైకేల్. శ్రీధర్, మాధవ్. ఎదురుగా నిలబడి గట్టిగా నవ్వుతున్నారు రాజేష్, సావిత్రి!

కొద్ది క్షణాలకి తేరుకుని, "సావిత్రీ! ఏవిటా దారుణమైన జోకు? ఎదురుగా తినమని భోజనం వడ్డించి అలాంటి మాటలా మాట్లాడతావ్? నువ్వు ఆడదానివేనా?" అన్నాడు మైకేల్ గట్టిగా!

"ఓరి అమాయకుడా! ఇక్కడ నరమాంసం రుచి మరిగిన రెండు పెద్ద పులులున్నాయిరా వాటి నోట్లోంచి కొన ప్రాణంతో బైటపడ్డ నేను, నా శరీరాన్నే కోసి మీకు వండి పెట్టాన్రా! నీకు రుచించకపోయినా, శ్రీధర్‌గాడూ, మాధవ్‌గాడూ లొట్టలేసుకుంటూ తింటారు! ఏరా? తినరూ?" అన్నది సావిత్రి. మామూలుగా కాదు, ప్రళయగర్జన చేసింది.

ఇప్పుడు సావిత్రి, ఇంతకు ముందు జగన్మోహనంగా నవ్విన ఆ సావిత్రి కాదు. బట్టలు చిరిగిపోయి, ఒళ్లంతా రక్తసిక్తమై, ప్రాణాలు కళ్లల్లో పెట్టుకున్న సావిత్రి కనిపిస్తోంది.

"మైకేల్! చూడ్రా ఆమెని? ఈ నీచులిద్దరి చేతుల్లో శీలాన్నిపోగొట్టుకున్న నా సావిత్రిరా! నా ప్రాణం!" అన్నాడు రాజేష్.

ఇప్పుడా ముగ్గురి కళ్లకీ, రాజేష్, సావిత్రి పర్వతాకారాల్లో భీకరంగా కనిపిస్తున్నారు.

శ్రీధర్, మాధవ్ గజ-గజ వణికిపోతున్నారు.

"ఏరా! నిజం ఒప్పుకోండి! నన్నెంత దారుణంగా చెరిచరో, చంపెయ్యాలని ప్రయత్నించిన మీ నుంచి తప్పించుకుని ఎలా పారిపోయి ఆ భయంకర లోయలో పడిపోయేనో చెప్పండి!" అని గర్జించింది సావిత్రి.

ఇద్దరూ సమాధానం చెప్పలేదు. ఒక్క ఉదుటున లేచి పాకలోంచి బైటికి పరిగెత్తేరు, వారి వెనకే మైకేల్ "ఆగండి" అని అరుస్తూ.

కాని పారిపోలేకపోయేరు. రెండు పర్వతాల్లో, ఎన్నడూ కనీవినీ ఎరగని రెండు క్రూరమృగాల్లా, మృత్యగహ్వరాల్లాంటి నోళ్లు తెరుచుకుని నిలబడ్డారు రాజేష్, సావిత్రి.

ప్రాణ భయంతో మైకేల్, శ్రీధర్, మాధవ్ వెనక్కి వెనక్కి నడుస్తున్నారు. వెనక్కి, ఇంకా వెనక్కి, మరెంతో వెనక్కి.... కొండ అంచుకి..... చేరిపోయేరు.

అది వాళ్లు పైకి వచ్చిన వైపు కాదు. మరోవైపు. వెనక పెద్ద అగాధం. చీకట్లో దాని తుది ఎక్కడో కనిపించడంలేదు.

"సావిత్రీ! మమ్మల్ని క్షమించు! రాజేష్! నువ్వైనా సావిత్రికి చెప్పు! ప్లీజ్! మమ్మల్ని చంపకండి!" అని ఆర్తనాదాలు చేస్తున్నారు శ్రీధర్, మాధవ్.

వికృతంగా నవ్వుతున్నారు రాజేష్, సావిత్రి.

ఇద్దరి నోళ్లల్లోంచి భయంకరంగా పైకి పొడుచుకుని వచ్చిన కోరలు. రక్తాన్ని గడ్డ కట్టించేలా వినిపిస్తున్న పాము బుసలు!

"సావిత్రికి నేనేం చెప్పేదిరా! హాస్పిటల్లో రెస్ట్ తీసుకుంటున్న నా దగ్గరికొచ్చి జరిగింది చెప్పింది సావిత్రి. మిమ్మల్ని సజీవ దహనం చేద్దామన్న కసితో బైల్దేరేను. కాని ఆమె నా పక్కన లేదురా! ఆకాశంలో మేఘ శకలంలా తేలుతూ వెడుతోంది. ఆమెనే చూస్తూ అనుసరించడంలో ఓ అగాధంలో పడిపోయేను. ఆ తరవాత కొద్ది క్షణాలకి నేనూ ఆమెలాగే మారిపోయేను. ఇప్పుడు ఇద్దరం ఒకటేరా! మీ కోసమే ఇక్కడున్నాం! మిమ్మల్ని సర్వనాశనం చెయ్యాలనే వుండిపోయేం! ఆ ద్వేషమే మాలో లేకపోతే ఎప్పుడో మా విచిత్ర లోకంలో విహారయాత్ర చేస్తూ వుండేవాళ్లం!" అంటూ సావిత్రితో కలిసి, రాజేష్ వాళ్లమీదికొచ్చేడు.

శ్రీధర్, మాధవ్‌లు భీకరమైన ఆర్తనాదాలు చేస్తూ కిందనున్న అగాధంలో పడిపోయేరు. కొద్ది క్షణాలు పర్వతాలలో, అడవిలో ప్రతిధ్వనించిన ఆర్తనాదాలు సద్దు మణిగేయి.

చిత్రం ఏవిటంటే, వాళ్లతోపాటే పడిపోవలసిన మైకేల్ మాత్రం ఎవరో చెయ్యి పట్టి లాగినట్లు ముందుకి పడ్డాడు.

లేచి నిలబడి వాళ్లిద్దరివైపు చూసేడు.

"మైకేల్! మా కోసం నువ్వు చాలా చేశావ్! కృతజ్ఞతలు. మా కథలకి సాక్ష్యంగా నువ్వు బతికే వుండాలి. శలవు." రాజేష్, సావిత్రి కదిలిపోయేరు. అతని కళ్లముందే ఇద్దరూ ఆకారాలు కోల్పోయి, పొగ మేఘాల్లో అనంత రోదసిలో కలిసిపోయేరు.

మైకేల్ కలలో నడుస్తున్నట్లు కొండ దిగసాగేడు.

దిగుతూ ఓసారి వెనక్కి చూసేడు.

అక్కడ గుడిసెలు లేవు. తలలు విరబోసుకున్న చెట్లు మాత్రం కనిపిస్తున్నాయి.

వేగంగా కొండదిగేడు. జీపు కదిలింది.

●

